

# నవభూమి హైదరాబాద్

3 జూన్,2025 మంగళవారం | పేజిలు:8

www.epaper.navabhoomi.in


# మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు నిర్మాణ వైఫల్యమే



- బ్లాక్-7 బాధ్యత తప్పించుకోలేరు
- తొలగించినా, సురక్షితం చేయాలన్నా మీ పనే
- సమగ్ర పునరుద్ధరణకు ప్రణాళిక అందించాలి
- ఇతర బ్లాక్‌లపై ప్రభావం పడకుండా చూడాలి
- 3 బ్యారేజీల్లో ఒకేరకమైన నిర్మాణ లోపాలు
- ఎన్‌డీఎస్ఏ నివేదిక స్పష్టంగా చెప్పింది
- ఎల్ అండ్ టీ సంస్థకు ప్రభుత్వం స్పష్టీకరణ

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు నిర్మాణ వైఫల్యమేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. బ్లాక్-7లో సమస్యకు ఎల్ అండ్ టీ సంస్థ బాధ్యత వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. దేశంలో ఆనకట్టల భద్రతకు సంబంధించి ఎన్‌డీఎస్ఏ అత్యున్నత చట్టబద్ధమైన సంస్థ అని, దాని నివేదికకు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని తెలిపింది. నివేదికలోని కొన్ని ఎంచుకున్న వ్యాఖ్యలను అంగీకరించి, కొన్నింటిని తిరస్కరించడం కుదరదని, నివేదికను మొత్తంగా చూడాలని మేడిగడ్డ నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టీకి స్పష్టం చేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర నీటి పారుదల శాఖ ఆ సంస్థకు ఘాటైన లేఖను రాసింది. కాళేశ్వరం ప్రాజె క్టులోని మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి నిర్మాణ లోపాలు కూడా కారణమని, ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేయనందువల్లే బ్యారేజీ కుంగిందని, ఇష్టారాజ్యంగా నిర్మాణం జరిగిందని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస‌ఏ) తేల్చిందని ప్రస్తావించింది. మేడిగడ్డలోని బ్లాక్-7లో రాఫ్ట్, పిల్లర్లతో పలుచోట్ల పగుళ్లు వచ్చాయని నివేదికలోని పదహారవ అంశంలో పేర్కొన్నారని గుర్తు చేసింది. బ్లాక్-7ను తొలగించడం లేదా సురక్షితంగా ఉంచడం నిర్మాణ సంస్థ బాధ్యతేనని, ఇతర బ్లాకులపై ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవడం కూడా దాని పనేనని ప్రస్తావించింది. మేడిగడ్డ సమగ్ర పునరుద్ధరణకు ప్రణాళికను ఎల్ అండ్ టీ అందించాలని తేల్చిచెప్పింది. ఎన్‌డీఎసఏ నివేదికలో కొన్ని అంశాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని, వాటిని అంగీకరించేది లేదని ఇటీవల ఎల్ అండ్ టీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం స్పందించింది. సుందిళ్ల, అన్నారంలో తలెత్తిన సమస్యలకు కారణమైన నిర్మాణ లోపాలు, నాణ్యత లోపాలు మేడిగడ్డలో పరిస్థితికి కూడా కారణమై ఉండవచ్చని ఎన్‌డీఎసఏ చెబితే దాని నుంచి పాఠాలు నేర్చుకోవడం మాని, నివేదికనే తప్పుపట్టే దిశగా ఎల్ అండ్ టీ ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. నిర్మాణ సంస్థకు, నీటిపారుదల శాఖకు మధ్య జరిగిన ఒప్పందంలోని 8, 16, 30, 32.2, 32.3, 34, 35.1, 38 అంశాల ప్రకారం ఎల్ అండ్ టీ నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. మేడిగడ్డ నిర్మాణ పటిష్టత, దానిపై ఆధారపడిన ప్రజల జీవనాధారం నేపథ్యంలో మళ్లీ వైఫల్యాలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పింది. మేడిగడ్డలో నిర్మాణ లోపాలే కాకుండా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలు, డిజైన్‌కు తగ్గట్లుగా నిర్మా ణం జరుగక పోవడం వంటి సమస్యలను ఎన్‌డీఎసఏ గుర్తించిందని ప్రస్తావించింది. కేంద్ర జలవనరుల సంఘం(సీడ బ్ల్యూసీ) నిపుణులు కూడా ఈ నివేదికను సమీక్షించింది, బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేసిందని గుర్తు చేసింది.

## ఎల్ అండ్ టీ నుంచి ఖర్చు రాబట్టండి!

**హైదరాబాద్-నవభూమి:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారణమైన నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ నుంచి బ్లాక్-7 నిర్మాణ ఖర్చును వసూలు చేయాలని తెలంగాణ విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సంచలన సిఫారసు చేసింది. ఈ మేరకు కాళేశ్వరం బ్యారేజీలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(వీ అండ్ ఈ) విచారణ జరిపి, సమర్పించిన నివేదికను కమిషన్ ఆమోదించింది. మార్చి 5వ తేదీన విజిలెన్స్ తన నివేదికను కమిషన్‌కు అందించింది. తర్వాత అదే నెల 18వ తేదీన నివేదికను కమిషన్ యథాతథంగా ఆమోదించి, మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ నుంచి బ్లాక్-7కు అయిన ఖర్చును తిరిగి రాబట్టాలని సిఫారసు చేసింది. కమిషన్ నివేదిక పూర్తి పాఠం తాజాగా వెలుగులోకి వచ్చింది. మేడిగడ్డ బ్యారేజీని 8 బ్లాకులుగా, 85 పిల్లర్లతో నిర్మించారు. అంచనా వ్యయం రూ.4613 కోట్లు. ఇక ఏడో బ్లాకులో మొత్తం 11 పిల్లర్లు ఉండగా వాటి పునర్నిర్మాణానికి అయ్యే మొత్తాన్ని ఎల్ అండ్ టీ నుంచి వసూలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. తెలంగాణ విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్ గత మార్చి 18వ తేదీన ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు సిఫారసు చేశారు. ఇప్పటిదాకా మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ పునర్నిర్మాణ బాధ్యతను, ఖర్చును ఎల్ అండ్ టీ భరించాలని నీటి పారుదల శాఖ కోరుతూ వచ్చింది. తాజాగా రికవరీ చేయాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేయడం గమనార్హం.

అంతేకాకుండా నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ - పీఈఎస్ జాయింట్ వెంచర్‌పై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు ఉపక్రమించాలని కమిషన్ కోరింది. బ్యారేజీ నిర్మాణం పూర్తి కాకముందే పని పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు ఇవ్వడం కూడా సరైంది కాదని గుర్తు చేసింది. సాగునీటి శాఖకు చెందిన 17 మంది అధికారులకు ఐపీసీలోని సెక్షన్-120(బీ), 336, 409, 418, 423, 426తోపాటు పీసీ యాక్ట్-1988, ఆనకట్టల భద్రత చట్టం-2021, పీడీపీపీ చట్టం-1984ప్రకారం క్రిమినల్ కేసులు పెట్టాలని చెప్పింది. వీరిలో పదవీ విరమణ చేసిన ఈఎన్‌సీ(జనరల్) సి.మురళీధర్, మాజీ ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) భూపతి రాజు నాగేంద్రరావు, రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఆర్థిక శాఖకు చెందిన డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ వి.ఫణి భూషణ్‌శర్మ, మాజీ ఈఎన్‌సీ(సీడీవో) ఎ.నరేందర్‌రెడ్డి, మాజీ సీఈ కె.ఎస.ఎస.చంద్రశేఖర్, ప్రస్తుత ఈఎన్‌సీ(ఓఅండ్ఎం) టి.శ్రీనివాస్ సహా 17 మంది ఉన్నారు. సి.మురళీధర్ పద వీ విరమణ చేసినప్పటికీ పదేళ్ల పాటు ఈఎన్‌సీ గా పని చేయడం గమనార్హం.

# దమ్ముంటే సస్పెండ్ చేయండి

- అప్పుడు అందరి బాగోతాలు బయటపెడతా
- బీజేపీలో ఇంటి దొంగలంతా ఒక్కటయ్యారు: రాజాసింగ్
- తనను కెలికితే అందరి బాగోతాలూ బయటపెడతా
- పెద్ద ప్యాకేజీ వస్తే బీజేపీ నేతలు బీఆర్ఎస్‌తో కలిసిపోతారు
- బీఆర్ఎస్, బీజేపీ పొత్తు అంటూ కవిత చేసిన వ్యాఖ్యలకు సమర్థన



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** బీజేపీ అధిష్ఠానం తనకు నోటీసులు జారీ చేయడం కాదని, కావాలంటే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, అప్పుడు అందరి జాతకాలు బయట పెడతానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగిందో ప్రజల ముందుంచుతానని హెచ్చరించారు. బీజేపీలో ఇంటిదొంగలంతా ఒక్కటయ్యారని మండిపడ్డారు. కరీంనగర్ నుంచి తనపై వార్ మొదలైందని ఆరోపించారు. తనను కెలికితే అందరి బాగోతాలూ బయటపెడతానని అన్నారు. రాజాసింగ్‌పై పార్టీ అధిష్ఠానం క్రమ శిక్షణ చర్యలకు సిద్ధమైందని, ఆయనకు నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించిందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. కొంత కాలంగా రాజాసింగ్ పార్టీలోని కొందరు నేతల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బీఆర్ఎస్, బీజేపీ పొత్తు అంటూ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. పెద్ద ప్యాకేజీ వస్తే బీజేపీ నేతలు బీఆర్ఎస్‌తో కలిసిపోతారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# 11న కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్

- 5న విచారణకు రావాలని కేసీఆర్‌ను కోరిన కమిషన్
- వ్యక్తిగత పనుల వల్ల హాజరు కాలేనన్న కేసీఆర్
- 11కు మారిస్తే హాజరవుతానని కమిషన్‌కు వినతి
- కేసీఆర్ విజ్ఞప్తి మేరకు 11వ తేదీన విచారణ

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 11వ తేదీన హాజరు కానున్నారు. మొదట ఆయనను ఈ నెల 5న విచారణకు రావాలని కమిషన్ కోరింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. విచారణకు స్వయంగా హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేసిన కేసీఆర్, వ్యక్తిగత పనుల కారణంగా 5న హాజరు కాలేనని చెప్పారు. 11కి మారిస్తే రాగలనన్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు కమిషన్ విచారణ తేదీని మార్చింది. మాజీ మంత్రి హరీశ్‌రావు మాత్రం కమిషన్ నోటీసుల్లో పేర్కొన్న ప్రకారం ఈ నెల 9నేకమిషన్ ఎదుట విచారణకు హాజరు కానున్నారు.



ప్రగతే మా పథం

8

# మల్కాజిగిరి జెడ్‌పి పాఠశాలలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

## పాల్గొన్న మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్



**మల్కాజిగిరి -నవభూమి:** మల్కాజిగిరి బాలుర ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు.తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమర వీరులకు నివాళులు అర్పించారు ఈ కార్యక్రమం లో హెడ్ మాస్టర్ వేంకట రమణ, జయలక్ష్మి , ఆశ, శ్రీధర్, వీరేష్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జాతీయ జెండా ఆవిష్కరించిన ఉప్పల్ ఎమ్మార్వో టి.వాణిరెడ్డి



**ఉప్పల్-నవభూమి:** తెలంగాణ అవతరణ దినోత్సవంలో భాగంగా ఉప్పల్ మండల కార్యాలయంలో సోమవారం ఉప్పల్ ఎమ్మార్వో టి,వాణిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆర్ ఐలు ఎం,అశ్విని గౌడ్,పి,సామ్సన్ పాల్,ఏఎస్ఓ ప్రియాంక,జూనియర్ అసిస్టెంట్లు నాగలక్ష్మి,అనంత రాములు, అలివేలు,వెంకన్న,లక్ష్మి, విజయ లక్ష్మి,బాలకృష్ణ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు: ఎమ్మెల్యే బండారి,కార్పొరేటర్ బన్నాల

**ఉప్పల్ -నవభూమి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్లోని పిస్తా హౌస్ చౌరస్తాలో టిఆర్ఎస్ పార్టీ జెండాని ఆవిష్కరించిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, అదేవిధంగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో బీరప్ప గడ్డ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించిన చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 10 సంవత్సరాల కాలంలో కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి పరిచారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లో ప్రజలు కాంగ్రెస్ పాలనతో ఎంతో విసిగిపోయారని,మళ్లీ కెసిఆర్ ఏ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని కొనియాడారు,ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### ప్రతి ముగ్గురు భారతీయులలో ఒకరు పాలను

# పానీయంగా వినియోగిస్తున్నారు

**ఖైరతాబాద్ జూన్ 2 -నవభూమి:** ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా, గోద్రేజ్ జెర్సీ భారతీయ వినియోగదారుల ప్రాధాన్యత లను "బాటమ్స్ అప్%ా% ఇండియా సేస్ చీర్స్ టు మిల్క్!" అనే నివేదిక విడుదల చేసింది. ప్రతి ముగ్గురు భారతీయులలో ఒకరు పాలను పానీయంగా వినియోగిస్తుండగా, హైదరాబాద్‌కు చెందిన వినియోగదారుల్లో 28 శాతం మంది పాలను పానీయంగా ఇష్టపడుతున్నారని అధ్యయనం వెల్లడిస్తుంది. దీనితో పాటుగా, 53% మంది వినియోగదారులు ఇంట్లో ఫ్లేవర్డ్ పాలు తాగడానికి లేదా తాము తాగే పాలకు అదనపు రుచిని జోడించడానికి ఇష్టపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు పోషకమైన రిఫ్రెష్‌మెంట్ డ్రింక్ ఇవ్వడానికి అనుకూలమైన మరియు ఆనందించే మార్గంగా ఫ్లేవర్డ్ పాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు, 47% మంది పగటిపూట దీనిని అందిస్తుంటే, 40% మంది ఆటలు ఆడే సమయంలో రిఫ్రెష్ ఎంపికగా దీనిని ఉపయోగిస్తున్నారు. ఈ అధ్యయనం పై గోద్రేజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి మాట్లాడుతూ, "గోద్రేజ్ జెర్సీ వద్ద , వినియోగదారుల ప్రాధాన్యత లకు తగినట్లుగా ఉత్పత్తులను అందజేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. రుచి, తాజదనం మరియు పోషణకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, కొత్త తరానికి పాలు అంటే ఏమిటో




బ్రాండ్ పునర్నిర్వచిస్తోంది. గోద్రేజ్ జెర్సీ బాదం మిల్క్ కేవలం రుచి పరంగా మాత్రమే కాదు, ఇది ఆరోగ్యకరమైన, పోషకాహార ఎంపిక, ఇది ప్రపంచ పాల దినోత్సవం నాడు మాత్రమే కాకుండా ప్రతిరోజూ పాలను ఇష్టపడే పానీయంగా చేస్తుంది" అని అన్నారు. భారతదేశం మరింత బుద్ధిపూర్వక వినియోగాన్ని స్వీకరించడంతో, పాలు చుట్టూ ఉన్న కథనం అభివృద్ధి చెందుతోంది. ఇది ఇకపై కేవలం సంప్రదాయం మాత్రమే కాదు , ఇది ఆధునిక జీవనశైలికి అనుగుణంగా ఉండే ఆవిష్కరణ ! . ఈ మార్పుకు గోద్రేజ్ జెర్సీ నాయకత్వం వహిస్తోంది, వారసత్వాన్ని తాజా ఆలోచనలతో మిళితం చేసి పాలను రోజువారీ పోషకాహారంలో ఒక విలువైన భాగంగా చేస్తుంది " అని ఆయన అన్నారు. బాటమ్స్ అప్%ా% ఇండియా సేస్ చీర్స్ టు మిల్క్!' అనే శీర్షికతో జరిగిన ఈ సర్వే ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ మరియు చెన్నై వంటి ప్రధాన నగరాల నుండి పాల ఉత్పత్తుల ప్రాధాన్యతలు, నాణ్యత అంచనాల పై దృష్టి సారించి పరిజ్ఞానం సేకరించింది. భవిష్యత్ వృద్ధికి ఇంధనంగా నిలిచేందుకు డెయిరీ రంగం అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల డిమాండ్లకు అనుగుణంగా మారాల్సిన అవసరాన్ని, ఆవిష్కరణలను నాణ్యతతో మిళితం చేయాల్సిన అవసరాన్ని ఈ పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. ఈ సర్వేను యూ గొవ్ రూపొందించింది మరియు నిర్వహించింది. గోద్రేజ్ గ్రూప్ యొక్క వైవిధ్యభరితమైన ఆహార మరియు వ్యవసాయ-వ్యాపార సమ్మేళనం అయిన గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (. జి ఎ వి ఎల్) అనుబంధ సంస్థ అయిన క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్, గోద్రేజ్ జెర్సీ బ్రాండ్ పేరుతో ఉత్పత్తులను విక్రయిస్తుంది

### తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను

# నెరవేర్చడంలో పాలకులు విఫలం

- ప్రాజెక్టుల పేరుతో ఆస్థులను కూడబెట్టిన బడా నేతల ఆస్తులను జాతీయం చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులువి.ఎస్.బోస్

**ఉప్పల్ - నవభూమి:** తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని, ప్రాజెక్టుల పేరుతో ఆస్థులను కూడబెట్టిన బడా నేతల ఆస్తులను జాతీయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవం సందర్భంగా సీపీఐ ఉప్పల్ మండల సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను బోస్ ఎగురవేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 12సంవత్సరాలు అయిందని అన్నారు. నీళ్లు,నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం ఎన్నో పోరాటాలు, ఎంతో మంది త్యాగాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, యువజనులు ఇలా యావత్ తెలంగాణ ఈ పోరాటంలో కదం కలిపిందన్నారు. మిలియన్ మార్చ్,సకల జనుల బంద్, ఉద్యోగుల సమ్మెలు ఈ పోరాటాన్ని ఉధృతం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని అందించాయన్నారు. కానీ,ఏ ఆకాంక్షలతో అయితే స్వరాష్ట్రం ఏర్పడిందో,ఆ ఫలాలను తెలంగాణ ప్రజలకు అందించకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దెనెక్కి అధికార దుర్వినియోగంకు పాల్పడి లక్షల కోట్ల ప్రజల సొమ్మును కేసీఆర్ తన జేబులో వేసుకున్నారని,రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో కన్నా అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని వారు ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుల పేరుతో కాంట్రాక్టర్ల నుండి కోట్లాది రూపాయలు గత ప్రభుత్వం దోచుకుందని వారు విమర్శించారు. అందుకే గత ప్రభుత్వం చేసిన అన్ని పనులపై విచారణ జరపాలని, అనధికారకంగా కూడబెట్టిన బీఆర్ఎస్ నేతల ఆస్థులను జాతీయం చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని బీఆర్ఎస్ నేతలు కోడై కూస్తున్నారని,జాతిపిత అంటే అర్థం తెలంగాణ సమాజాన్ని లూటీ చేయడమా అని వారు ప్రశ్నించారు. అదే విధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను,అమాయక గిరిజనులను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని,సీజ్ ఫైర్ ను ప్రకటించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. కాశ్మీర్ పహల్గాంలో దేశ పౌరులపై నలుగురు ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల ఘటనలో 27మందికి పైగా మరణించారని,అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆ నలుగురు ఉగ్రవాదులను పట్టుకోకుండా చేతకాకుండా ఉన్నారని,కానీ దేశంలోని పౌరులు అమాయక ఆధీవాసీలను హహనం చేయడం అప్రజాస్వామికమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్ రావు,కె. ధర్మేంద్ర,జిల్లా సమితి సభ్యులు నారా నర్సింహా,ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్,మండల కార్యవర్గ సభ్యులు లక్ష్మీ నారాయణ,నర్సింహా రావు, సత్యనారాయణ,కృపాకర్, నర్సింగ్ రావు,మిరియాల సాయిలు,రజనీ,శోభ, శ్రీనివాస్,సాయిలు,ప్రతాప్, సుదర్శన్,అక్షర్ రెడ్డి,అజీమ్ పాషా, మహేష్ పాల్గొన్నారు.



# రాష్ట్రాన్ని అభివృద్ధి,సంక్షేమంలో అగ్రపథాన నిలిపిన గొప్ప నాయకులు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్

### బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్ - జూన్ 2-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జంట సర్కిల్ కార్యాలయాలో కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానందు ముఖ్యఅతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.అడుగడుగునా వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని, తెలంగాణ సమాజాన్ని ఏకం చేస్తూ ఉద్యమమే ఊపిరిగా కేంద్రంతో కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని తనదైన దార్శనిక పాలనతో ఒకవైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమంతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నెం.1గా అభివృద్ధి చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉప కమిషనర్లు నర్సింహా, మల్లారెడ్డి, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, హేమలతా సురేష్ రెడ్డి, ఈఈ లక్ష్మీ గణేష్, కిష్టప్ప, డీఈ లు పాపమ్మ, శిరీష, రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సోనియమ్మ దయతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

### ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్ - నవభూమి:** సోనియమ్మ దయ వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంను ఇచ్చిన ఘనత సోనియమ్మకు,తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతాయన్నారు.తెలంగాణ ప్రజలు సోనియాగాంధీకి ఎప్పటికీ కృతజులుగా ఉండాలన్నారు. సోమవారం ఉప్పల్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు.ఉప్పల్ లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పరమేశ్వర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు.

ఈకార్యక్రమంలో ఉప్పల్,రామంతాపూర్,హబ్సిగూడ,చిలకనగర్ నాచారం డివిజన్ అధ్యక్షులు బకారం లక్ష్మణ్,రఫీక్,రాజేష్ ముదిరాజ్,విజయ్ కుమార్,బండారి శ్రీకాంత్ గౌడ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మహిళా కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్,ఎస్,సి సెల్,బీసీ సెల్,కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పార్కింగ్ చేసిన వాహనాలను దొంగతనం చేసిన

# ఇద్దరు నిందితుల అరెస్టు-రిమాండ్

- 2014లో నుంచి సైబరాబాద్ పరిధిలో దాదాపు 20 కేసుల్లో జైలుకు..
- రూ.12 లక్షల విలువ చేసే,కారు, ద్విచక్ర వాహనాలు,అశోక్ లీల్యాండ్,గూడ్స్ స్వాధీనం





**కుత్బుల్లాపూర్- జూన్ 2-నవభూమి:** అత్యంత రద్దీ ప్రాంతంలో పార్కింగ్ లో ఉంచిన ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసిన ఇద్దరు అత్యంత ప్రొఫెషనల్ జాయ్ రైడింగ్ అలవాటు ఉన్న నేరస్థులను జీడిమెట్ల పోలీసులు సిసియస్, బాలానగర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు నక్కా శ్రీనివాస్ రావు, (32 )సాయి బాబా నగర్ ఐడిఏ జీడిమెట్ల .మహమ్మద్ షోహెబ్, వయస్సు(26 )బౌరంపేట దుండిగల్ నివాసి వీరిని అదుపులోకి తీసుకొన్న పోలీసుల విచారణలో నిందితులు ఇద్దరూ 2014 నుండి జీడిమెట్ల, సూరారం, పేట్ బషీరాబాద్, నేరేడ్‌మెట్, కుషాయిగూడ, సైబరాబాద్‌లోని షామీర్‌పేట రాచకొండ కమిషనరేట్ పరిధిలో మోటార్‌సైకిల్ దొంగతనాలకు పాల్పడినట్లుగా గుర్తించారు. 15కంటే ఎక్కువ కేసులలో జైలు కు వెళ్ళివచ్చినట్లుగా గుర్తించి వారి నుండి ఒక హ్యుందాయ్ వెర్నా కారు, (08) ద్విచక్ర వాహనాలు ఒక అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.వీటివిలువ12,00,000- లక్షలవరకు ఉంటుందని అంచనా.నిందితులకు గతంలో నేర చరిత్ర ఉంది, అనేక క్రిమినల్ కేసుల్లో ను ప్రమేయం ఉంది..వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు, ఈ కేసులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బందికి అవార్డులనుఅందచేస్తామని బాలానగర్ అడిషనల్ డిసిపి సత్య నారాయణ తెలిపారు.

# జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే

**కుత్బుల్లాపూర్ - జూన్ 2-నవభూమి:** యోజకవర్గం పరిధిలోని గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగింది..అనంతరం స్వరాష్ట్ర సాధనలో ప్రాణత్యాగులైన అమరవీరులను స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పూలమాలవేసిఘననివాళులర్పించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ. ప్రత్యేక రాష్ట్ర సాధన ఏర్పాటుతో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ కి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా యావత్ తెలంగాణ ప్రజలు తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. తెలంగాణ ఉద్యమ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు..తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియామ్మకు తెలంగాణ ప్రజలు ఎల్లప్పుడు రుణపడి ఉంటారన్నారు..స్వరాష్ట్ర సాధనలో సబ్బండా వర్గాలు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు కలలుగానే మిగిలిపోయాయని అన్నారు.. తెలంగాణ రాష్ట్రం పుష్కరకాలంలో అడుగులువెస్తున్న క్రమంలో అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రజాపాలనలో కార్యరూపం దాలుస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా సంఘాలు,





కాంగ్రెస్ మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, బీసి సెల్, ఎస్సి సెల్,మైనారిటీ సెల్,లేబర్ సెల్ నాయకులు, ఎన్ఎస్ యుఐ నాయకులు, సేవదళ్ నాయకులు, సోషల్మీడియాకోఆర్డినేటర్స్,ప్రజలతో పాటు పాల్గొన్నారు

# యుక్త ప్లైవుడ్ షాప్ ఘనంగా ప్రారంభం

- వినియోగదారులకు అందుబాటు ధరలకు అందించడం మా ముఖ్య ఉద్దేశం

**ఎల్బీనగర్ -నవభూమి:** హయత్‌నగర్ సంగం బేకరీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన యుక్త ప్లైవుడ్ అండ్ హార్డ్ వేర్ షాప్ ను నిర్వాహకులు సింగిరెడ్డి నిఖిల్ రెడ్డి, పన్నాల శివారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మావద్ద ప్లైవుడ్ హార్డ్వేర్ లామినేటర్ వినీర్, డోర్స్ మా ప్రత్యేకత తమకు ఈ రంగంలో ఉన్న అనుభవంతో హయత్ నగర్ లో షాపు ఏర్పాటు చేశామన్నారు. తమ వద్ద అన్ని కంపెనీల ప్లైవుడ్, హార్డ్ వేర్, లామినేట్స్, వెనీర్, డోర్ల ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే తమ వద్ద అందుబాటులో ధరలు ఉన్నాయన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని



నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తదితరులు

## అల్వాల్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం







**అల్వాల్-నవభూమి:** ఆల్వాల్ ము న్సిపల్ పరిధిలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్వాల్ మున్సిపాలిటీ, అల్వాల్ పోలీస్ స్టేషన్, టిఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ జేఏసీ ఇతర సంఘాల నాయకులు వేరువేరుగా ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు . మల్కాజ్గిరి నియోజకవర్గం ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు ఉద్యమకారుడు పుట్నాల కృష్ణ ఆధ్వర్యంలో జండా విష్కరణ చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో దయాకర్ సంతోష్ ఉద్యమకారులు పాల్గొన్నారు తెలంగాణ ఆవిర్భావ దిన శుభ సందర్భంగా ఎస్ హెచ్ ఓ రాహుల్ దేవ్ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ మున్సిపల్ కార్యాలయంలో జండా ఆవిష్కరణ చేసిన డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు 133 డివిజన్ టిఆర్ఎస్ యూత్ విభాగం వారిచే నిర్వహించిన నిర్వహించిన కార్యక్రమంలో జండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేసి శీతల పానీయం బాటసారులకు అందజేశారు. అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఏ బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు చీమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జయశంకర్ సార్ కు పూల మాలలు వేసి నివాళులు అర్పించి ఉద్యమ కారులను సన్మానించారు





### స్వంతరాష్ట్రంలో ప్రజలు

# మరింత దోపిడీకి గురవుతున్నారు



సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

**కుత్బుల్లాపూర్ జూన్ 2-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ మరియు జగద్గిరిగుట్టలో జాతీయ జెండాను ఎగురవేసి ఆవిర్భావ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రజలు దోపిడీకి గురవుతున్నారని దోపిడి పోవాలంటే సొంత రాష్ట్రం ఏర్పడాలని ప్రజలు పోరాటం చేస్తే ఆ పోరాటాన్ని అవకాశంగా మలుచుకొని తెలంగాణ రాష్ట్ర సమితి నాయకత్వం ఉద్యమాన్ని ఉధృతం చేసి చివరికి వందలాదిమంది బలిదానాలతో తెలంగాణ ఏర్పడిందని, కానీ నేడు తెలంగాణ కొంతమంది చేతుల్లో బంధీ అయిందని సంపద మొత్తం లూటీ అయిందని ప్రాజెక్టుల పేరుతో వేలాదిమంది ప్రజలు తమ గోడు ఊరు వ్యవసాయం కోల్పోతే ఇంకా పునరావాసం అందుకోకుండా వేలాది మంది ప్రజలు ఉన్నారని ఇలా ఏ రకంగా చూసినప్పటికీ సొంత తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు మరింతగా దోపిడీకి దగాకు గురయ్యారని, టిఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ప్రజలకు మేలు చేకూరుస్తది అనుకుంటే అప్పటి అధికారులే అప్పటి నాయకులు అప్పటి కబ్జాదారులే నేడు మళ్ళీ కాంగ్రెస్ కండువా కప్పుకొని తిరుగుతున్నారని దీనివల్ల లాభపడేది అవకాశవాద రాజకీయ నాయకులు తప్పించి పేద మధ్యతరగతి ప్రజలు మాత్రం కాదని ఇప్పటికైనా ప్రజలంతా వాస్తవాలను తెలుసుకొని నిజంగా ప్రజల కోసం నిత్యం మాట్లాడే కమ్యూనిస్టుల వైపు నిలిస్తే దోపిడిదారులను తరిమి ప్రజారాజ్యం ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు యేసు రత్నం మాట్లాడుతూ తెలంగాణ వస్తే నీళ్లు నిధులు నియామకాలు వస్తాయని ఆశించినటువంటి ప్రజలు మోసపోయారని, గద్దర్నీకుతున్న వాళ్లంతా తెలంగాణ కోసం పోరాటం చేయని వాళ్లేనని నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు 250 గజాల స్థలాన్ని ఇవ్వాలని తూతూ మంత్రంగా కొంతమందికి కవిల పేరుతో కోటి రూపాయలు ఇస్తే సరిపోదని అందరికీ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి స్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్,సహాయ కార్యదర్శులు వి హరినాథ్ రావు, డి రాములు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి, సత్యవతి, జయమ్మ, సిపిఐ నాయకులు నరసింహారెడ్డి, సహదేవ రెడ్డి, సదానంద్, సాయిలు, దుర్గయ్య, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, యువజన సంఘం కార్యదర్శి వెంకటేష్, కీర్తి, విక్రమ్, సుంకిరెడ్డి, భీమేష్, సత్తిరెడ్డి, మహేందర్, బోనాల కనకయ్య,రాజు, దేవానందం, రవి, ప్రభాకర్, జంబు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఎగురవేసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజ్

**కుత్బుల్లాపూర్ జూన్ 2 నవభూమి:** 14 ఏళ్ళు అలుపెరుగని పోరాటంతో ఉద్యమ రథసారథి కేసీఆర్ సారధ్యులు సాధించిన రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రం: మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలుజాతీయ పతాకాన్ని బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు.మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గార్ల ఆదేశానుసారంగ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జాతీయ పతాకాన్ని బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. సీనియర్ నాయకులు కార్యకర్తలతో స్వీట్లు తినిపించుకొని ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ జెండాను ఎగురవేసిన టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి సొంటి పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్ - జూన్ 2-నవభూమి:** తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించిన సోనియా గాంధీ నాయకత్వంచిరస్మరణీయంతెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో సోనియా గాంధీ పాత్రచాలాకీలకమైనదిగాభావించబడుతుంది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావానికి ఆమె ఇచ్చిన మద్దతు ద్వారా, దీర్ఘకాలంగా కొనసాగిన ప్రజా పోరాటానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో సోనియా గాంధీ పాత్ర చాలా కీలకమైనదిగా భావించబడుతుంది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావానికి ఆమె ఇచ్చిన మద్దతు ద్వారా, దీర్ఘకాలంగా కొనసాగిన ప్రజా పోరాటానికి సోనియా గాంధీ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేయడం జరిగింది.తెలంగాణ తల్లి ఆశీస్సులతో, ప్రతి ఒక్కరికి సుఖసంతోషాలు కలగాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లాల్ మహమ్మద్, దండే రాజు, సుఖ్ దేవ్,రామిరెడ్డి,హర్భజన్ సింగ్, సంజయ్, పవన్, అన్వర్, మరలింగ



మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

# బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన హరీశ్ రావు



**ఉప్పల్ - నవభూమి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ భవన్లో వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్రావు,సబితా ఇంద్రారెడ్డి,శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,సహచర ఎమ్మెల్యే లు పాల్గొన్నారు.అనంతరం జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు.ఎన్నో ఉద్య మాలతో స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని హరీశ్రావు అన్నారు.

# స్పోర్ట్ కిట్స్ పంపిణీ చేసిన కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్



**ఉప్పల్ -నవభూమి:**హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ చిన్నారులకు స్పోర్ట్ కిట్స్ పంపిణీ చేశారు,ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవిలో పిల్లలు ఆడుకోవడానికి జిహెచ్ఎంసి అందించిన ఆట వస్తువులు చిన్నారులకు చేతన హరీష్ పంపిణీ చేశారు,పిల్లలు శారీరకంగా బలంగా ఉంటే మానసికంగా బలంగా ఉంటారని తెలిపారు,వేసవి సెలవుల్లో అందరూ ఆనందంగా గడపాలని ప్రతి ఒక్కరు సరదాగా ఆటలు ఆడుకోవాలని తెలిపారు, చిన్నారులు ఆనందంతో కార్పొరేటర్ తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**అల్వాల్ , నవభూమి ప్రతినిధి, జూన్ 2:** మైనంపల్లి హనుమంతరావు స్ఫూర్తి మరియు మార్గదర్శకత్వంతో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈరోజు అల్వాల్లోని ఆల్వాల్ "మీ సేవా" కార్యాలయం సమీపంలోని రాజీవ్ గాంధీ సర్కిల్లో ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నామని మచ్చ బొల్లారం కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ చెప్పారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేడుకల్లో భాగంగా, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ జీ విగ్రహానికి పూలమాల వేసి, తెలంగాణ గుర్తింపు, ఐక్యత మరియు పురోగతి స్ఫూర్తిని ప్రతిబింబించే గొప్ప జెండా ఎగురవేత కార్యక్రమం జరిగింది వివరించారు.ఆల్వాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి ఈ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షులు - సురేందర్ రెడ్డి, ఉదయ్ కుమార్ %ం% భాస్కర్ లతో పాటు నాయకత్వం వహించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎస్ సి సెల్, బిసి సెల్, మైనారిటీ నాయకులు, మహిళా బృందం ఎం ఎస్ యు ఐ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో మద్దతుదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# జేఈఈ ఫలితాల్లో నారాయణకు ర్యాంకుల పంట

◆ డైరెక్టర్లు సింధూర నారాయణ,శరణి నారాయణల వెల్లడి





**శేరిలింగంపల్లి -నవభూమి:** జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగరిలలో టాప్ 10లో 5 ర్యాంకులతో నారాయణ విజయదుందుభి మోగించింది. 3, 4, 4, 7, 10 వంటి ర్యాంకులను నారాయణ కైవసం చేసుకుంది. ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 50 లోపు 25 ర్యాంకులు, టాప్ 100 లో 43 ర్యాంకులు సాధించింది. సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాలలో నారాయణ విద్యార్థులు టాప్ ర్యాంకులతో మరోసారి సత్తా చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ సింధూర నారాయణ, డాక్టర్ శరణి నారాయణలు తెలిపారు. అన్ని కేటగరీల్లో ఇప్పటి వరకు 10 లోపు 10 ర్యాంకులు, 50 లోపు 42 ర్యాంకులు, 100 లోపు 75 ర్యాంకులను సాధించినట్టు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనితరసాధ్యమైన శిక్షణ, రీసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రాంలు, మైక్రో షెడ్యూల్, బెస్ట్ స్టడీ మెటీరియల్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్, టాప్ ఫ్యాకల్టీతోనే ఈ ర్యాంకులు సాధించామని తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి క్లిష్టమైన ప్రశ్నలు వచ్చిన తక్కువ సమయంలో సరైన సమాధానం గుర్తించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎన్-లెర్న్ యాప్ ద్వారా ఛాప్టర్లవారీగా ప్రాక్టీస్ టెస్టులు, ఆన్ లైన్ మాక్ టెస్టులు నిర్వహించటం వల్లనే నారాయణ విద్యార్థులు ఇంతటి ప్రతిభా పాతవాలను ప్రదర్శించగలిగారని తెలిపారు. ఈ విధానాల వల్లే తెలుగు రాష్ట్రాల నుండి అత్యధిక విద్యార్థులు, జాతీయ స్థాయిలో నారాయణ నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఐఐటిల్లోకి ప్రవేశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థలు అభినందనలు తెలియజేశారు.

# తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ఉద్యమకారులకు అండగా నిలబడాలి

**కుత్బుల్లాపూర్ - జూన్ 2-నవభూమి:** తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమకారులకు అండగా నిలబడి గుర్తింపు ఇవ్వాలని ఆర్ జి తెలంగాణ ఉద్యమకారుడు రాష్ట్రీయ దళిత సేన ఓబిసి జాతీయ అధ్యక్షుడు గూడ ఐలయ్యగౌడ్ ప్రభుత్వానికి డిమాండ్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగదీర్ గుట్ట డివిజన్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఉద్యమకారుడు ఓబీసీ జాతీయ అధ్యక్షుడు గూడ ఐలయ్య గౌడ్ జాతీయ జెండా ఆవిష్కరించి అమరులైన ఉద్యమకారులకు ఘనంగా నివాళులర్పించి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల బలిదానాలను తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించిన సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందని వచ్చిన తెలంగాణను కెసిఆర్ 10 సంవత్సరాలు పరిపాలించి అప్పుల తెలంగాణ గా మార్చారని తెలంగాణ ఉద్యమకారులను గుర్తించకుండా తెలంగాణ ఉద్యమ వ్యతిరేకులను మంత్రులుగా చేసి సామాజిక తెలంగాణ గొంతులు నొక్కారు అన్నారు తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినది కనుక ప్రజాపాలనలోతెలంగాణఉద్యమకారులను



గుర్తించి వారికి అండగా నిలబడాలని ఉద్యమకారులకు పింఛన్ ఇవ్వాలని సామాజిక తెలంగాణ ఏర్పాటు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి వరమ్మ ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షులు ఏం జనార్దన్ గారు మంగా సులోచన యాదగిరి తదితరులు పాల్గొన్నారు ఘనంగా జాతీయ జెండా ఎగరవేసి స్వీట్లు పంచి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు

## జాతీయ జెండాను ఎగుర వేసిన

# కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్చార్జి హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ - జూన్ 2-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్మున్సిపాలిటీ లోని బహుదూర్ పల్లి చౌరస్తాలో మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతు ఎన్నో త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వంచేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై పని చేయాలన్నారు. ఈ యువ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, ఆర్థిక సాంకేతిక అభివృద్ధి తాలూకు శక్తివంతమైన ఆధునిక పర్యావరణ వ్యవస్థను కలిగి ఉంది. తెలంగాణ ప్రజలు పురోగతి, శ్రేయస్సు మార్గంలో ముందుకు సాగాలన్నారు తెలిపారు ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ జయరామ్, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ అవిజే జేమ్స్, బొంగునూరు కిషోర్ రెడ్డి, సక్కడి రంగయ్య, కృష్ణమూర్తి, పరశురామ్ గౌడ్, వేణు కుమార్, కరోల్ల సదానందం, జక్కుల మల్లేష్ యాదవ్, పోలీస్ జీవెందర్ రెడ్డి, బెంబిడి మల్ల రెడ్డి, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, నాగభూషణం, ధర్మారెడ్డి, డివిజన్ అధ్యక్షులు నవీన్ రెడ్డి, ఎండి లయక్, గణేష్, పెరిక శివ, పందరి, సంతోష్ ముదిరాజ్, సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, ఎండి జాకీర్, బేకు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షురాలు స్వాతి, సుజాత యాదవ్ కార్యకర్తలు భారీ ఎత్తున్న పాల్గొన్నారు.



## దుండిగల్ మున్సిపల్ కార్యాలయం ముందు జెండా ఎగుర వేసిన

### కమిషనర్ వెంకటేశ్ నాయక్, ఎమ్మార్వో మతిన్ తదితరులు





**కుత్బుల్లాపూర్ జూన్ 2-నవభూమి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ మున్సిపల్ ఆఫీస్ ముందు జెండా ఎగురవేశారు, అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులు అర్పించినారు, ఈ కార్యక్రమంలో గండి మైసమ్మ ఎమ్మార్వో సయ్యద్ అబ్దుల్ మతిన్ , మున్సిపల్ మండల సిబ్బంది పాల్గొన్నారు

## బహిరంగ ప్రదేశాలో చెత్త వేస్తే జరిమానా తప్పదు

### గార్బేజ్ వద్ద చెత్త వేసిన వ్యక్తి రూ.2500 జరిమాన

**కుత్బుల్లాపూర్ -నవభూమి:** వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఒక మార్పు అభివృద్ధికి మలుపు నినాదంతో , ఎవరూ బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయవద్దని వివరించారు, కొన్ని గార్బేజ్ వన బుల్ పాయింట్స్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది, అలా వేసిన గుర్తించి వారిపైన ఈ రోజు 2500 జరిమానా విధించడం జరిగింది, కాబట్టి ప్రతి ఒక్కరూ బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయవద్దని అలా వేసిన వారిపైన జరిమానా విధిస్తామని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు







## రమ్య గ్రౌండ్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కూకట్‌పల్లి, జూన్ 2-నవభూమి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ 3వ ఫేస్‌లోని రమ్య గ్రౌండ్ గణేష్ మండప వద్ద శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కట్టా నరసింగరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం స్థానికులకు సీట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జె ఎస్ నారాయణరావు, కొండూరు నారాయణరాజు, మోర్ల రామకృష్ణ, ముప్పాళ్ళ సాంబశివరావు, కోన కోటేశ్వరరావు, గోనెల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి



**కూకట్‌పల్లి-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దీర్ఘకాల పోరాటం, అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతూ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి గౌరవం ఇచ్చే దిశగా ప్రతివారూ కట్టుబడి ఉండాలన్నారు. యువతకు ఉపాధి, రైతులకు న్యాయం, మహిళలకు భద్రత, ప్రజల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేలా తాను నిరంతరం పనిచేస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నూతన దిశగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరి జీవితం వెలుగులతో నిండాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆకాంక్షించారు.

## జాతీయ జెండాను ఎగురవేశారు

**కుత్బుల్లాపూర్ -నవభూమి:** రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందనగర్లో, కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి భారత మాత చదువుల తల్లి సరస్వతి దేవి చిత్రపటాలకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ప్రిన్సిపల్ ప్రేమలత.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ అశోక్, ఫిజికల్ ట్రైనర్ కిరణ్ సాగర్ ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.




## కొట్లాడితేనే తెలంగాణ సాధ్యమైంది

### సీపీఐ బాచుపల్లి మండల సహాయ కార్యదర్శి ఆశీ యాదయ్య



**కుత్బుల్లాపూర్ -నవభూమి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద బాచుపల్లి మండల సహాయ కార్యదర్శి ఆశీ. యాదయ్య జాతీయ జెండా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడదే నీళ్లు, నిధులు, నియామంకలు కానీ ఎక్కడ ఆ విధానం సహకారం కాలేదు అని అన్నారు. తెలంగాణ సాధనలో మేము అనేక పోరాటాలు నిర్వహించము. సకల జనుల సమ్మెలు, వంట వర్పులు ఇలా అనేక పోరాటాలు చేశాము. అని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వం, ఇప్పుడు ప్రభుత్వం మున్సిపల్ కార్మికులసమస్యలు ఎవ్వరుపట్టించుకోవడం లేదు అని వాపోయారు. తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ,ఏఐటీయూసీ నాయకులు మేకల బాలకృష్ణ, శ్యామ్, దుర్గయ్య, నర్సమ్మ,భాగ్యమ్మ,అమృత, కౌసల్య, యాదమ్మ, లక్ష్మి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ట్రాఫిక్ సిఐ ముత్తు యాదవ్ జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన కూకట్ పల్లి జర్నలిస్టులు



**కూకట్‌పల్లి, జూన్ 2,-నవభూమి:** కూకట్ పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిఐ ముత్తు యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు స్థానిక జర్నలిస్టులు పాల్గొని ముత్తు యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో జర్నలిస్టుల సంఘం నాయకులు తొట్ల పరమేష్ గౌడ్, నాగరాజ్ యాదవ్, నామల శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, రాజు యాదవ్, ప్రవీణ్ బంటు తదితరులు పాల్గొన్నారు. వారంతా ముత్తు యాదవ్‌కు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు. సామాజిక సేవలతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో చొరవ చూపుతున్న ముత్తు యాదవ్ సేవలను పలువురు ప్రశంసించారు.

## జాతీయ జెండాను ఎగురవేసిన బిజెపి నాయకులు భరత్ సింహా రెడ్డి



**కుత్బుల్లాపూర్ - జూన్ 2:-నవభూమి:** కుత్బుల్లాపూర్ గ్రామం బీజేపీ కార్పొరేటర్ కార్యాలయం వద్ద తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణలోపాల్గొని తదుపరిఅయోధ్య నగర్ లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి.ఈ కార్యక్రమం లో సీనియర్ సిటిజెన్ కమిటీ అధ్యక్షులు నర్సింహా రెడ్డి ,బలవంత్ రెడ్డి ,వీరారెడ్డి గ,పెద్ది మల్లేశం ,మురళి ,నాగేష్ ,నార్లకంటి ప్రతాప్ ,పెద్దింటి సాయిలు ,చిత్తారి ,పద్మారెడ్డి,వాని,అంజయ్య,వీరేశం,సింహాద్రి, పాపయ్య ,క్రాంతి,మహేష్, శ్రవణ్,మూర్తి,ఈశ్వర్,శివ తదితరులు పాల్గొన్నారు.

# డలాస్‌లో ఘనంగా బీఆర్ఎస్ రజతోత్సవం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

### ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహిళల బతుకమ్మ ఆట








**కూకట్‌పల్లి, జూన్ 2, -నవభూమి:** అమెరికా టెక్సాస్ రాష్ట్రంలోని డలాస్ నగరంలో భారతీయ రాష్ట్రీయ సమితి (బీఆర్ఎస్) పార్టీ రజతోత్సవం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ కీలక నాయకులు, డలాస్ ప్రాంతానికి చెందిన ప్రవాస తెలంగాణవాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతిని, ఉమ్మడి బాధ్యతను ప్రతినిధించే విధంగా ఈ వేడుకలో మహిళలలు పాల్గొనడం విశేషం. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి ఆధ్వర్యంలో, స్థానిక బీఆర్ఎస్ మహిళా సభ్యుల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంలో మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొన్న బతుకమ్మ ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానికులు ఈ కార్యక్రమాన్ని  తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ఒక ప్రతీకగా భావించారు. బతుకమ్మ వంటి పండుగలు ప్రాంతీయ ఆత్మీయతను, మహిళా ఐక్యతా శక్తిని వెలికితీసే సందర్భాలుగా నిలుస్తున్నాయని నిర్వాహకులు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రవాస తెలంగాణ సమాజం మధ్య ఐక్యత, సాంస్కృతిక మమకారం మరింత బలపడినట్లు పేర్కొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో  తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**ఆల్వాల్-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ అల్వాల్ మండల సమితి కార్యదర్శి అమరావతి బాబు ఆధ్వర్యంలో యాప్రాల్ బస్టాండ్ వద్దజాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.   సిపిఐ జిల్లా నాయకులు కే సహదేవ్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ వచ్చి 11 సంవత్సరాల గడుస్తున్న నిజమైన తెలంగాణ రాలేదని టిఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వంలో దోచుకొని దాచుకున్నారు తప్ప ప్రజలకు ఏమి చేయలేదని అన్నారు.  రాష్ట్రాన్ని దివాలాదీసి దని అప్పులకుప్పగా మార్చారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తున్నా గాని 6 గ్యారంటీల ఊసే లేదు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చి భూములు స్వాధీనం చేసుకుంటామని మిగులు భూములు పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వై వెంకటేష్న పి చంద్రయ్య సల్మాన్ బిగ్ డి జంగయ్య ఏఐటీయూసీ నాయకులు బి నరేంద్ర చారి ఎన్ సంతోష ఎన్ పద్మ జి గణేష్ చిరంజీవి పాల్గొన్నారు.




### తెలంగాణ ఉద్యమకారులకు

# అవకాశాలు కల్పించాలి

- జేఎన్టీయూ విద్యార్థి నేత, తెలంగాణ ఉద్యమకారుడు ఎరవెల్లి జగన్
- ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో అవకాశాలు కల్పించాలి
- రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని విజ్ఞప్తి



**కూకట్‌పల్లి, జూన్ 2,-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన విద్యార్థులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలని జేఎన్టీయూ విద్యార్థి నేత, తెలంగాణ ఉద్యమకారుడు ఎరవెల్లి జగన్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ కాలంలో విద్యార్థులుగా తాము చేసిన పోరాటాన్ని జగన్ స్మరించుకున్నారు. తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక చైర్మన్‌గా, డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్‌ను స్థాపించి, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీతో కలసి ఉద్యమంలో కీలకపాత్ర పోషించామని వివరించారు. మానుకోట రైల్ రోకో, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, వంటవార్పు వంటి కార్యక్రమాల్లో పాల్గొన్న తానూ సహచరులూ, ఉమ్మడి కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో విద్యార్థుల శక్తిని ఉద్యమంలోకి నింపిన విషయాలను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం పది సంవత్సరాలు పూర్తిచేసుకుని పదకొండవ వసంతంలోకి అడుగు పెడుతోందన్న ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ రాష్ట్రం ఎన్నో త్యాగాల ఫలితమని, అమరుల త్యాగాన్ని స్మరించుకుంటూ వారిని గౌరవించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో అవకాశాలు కల్పించాలని, వారు కోరుకున్న విధంగా నియామకాలు చేపట్టాలని జగన్ ప్రభుత్వాన్ని కోరారు. రైతే రాజు అన్న నానుడిని నమ్ముతూ రైతులకు నీరు, ఉచిత కరెంటు, అన్ని రకాల సౌకర్యాలు అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. టెక్నాలజీ రంగంలో తెలంగాణను నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టిన మాజీ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**కుత్బుల్లాపూర్-జున్ 2:-నవభూమి:** నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామం జడ్పి హెచ్ స్గవర్నమెంట్ స్కూల్ లో శ్రీమెరు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిర కార్యక్రమ%శీ%లో పాల్గొని ఈ యొక్క ఉచిత వైద్య శిబిరాన్ని అందరు సద్వినియోగం చేసుకో వాలని ప్రజలను కోరిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి,సాయిలు, సతీష్, వెంకు,సోనీ,పాపయ్య,శ్రీకాంత్,మహేష్,శ్రవణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## విషాదం .. రైలు ప్రమాదంలో ఇద్దరు సోదరులు మృతి

**చార్మినార్-నవభూమి:** హైదనాబాద్‌లో విషాదం చోటు చేసుకుంది. మూగ జీవాలకు ఆహారం అందించడానికి వెళ్లిన ఇద్దరు సోదరులు మృత్యువాత పడిన ఘటన రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. రెయిన్ బజార్ పరిధిలోని నివసించే షాబుద్దీన్ (26) , ఫైజాన్ (21), బక్రీద్ పండుగ సందర్భంగా ముందస్తుగా వారి కుటుంబం మేకలను కొనుగోళ్లు చేసింది. వాటికీ ఆహారాన్ని అందించడానికి ఇద్దరు సోదరులు సోమవారం ఇంటికి సమీపంలోని యాకుత్‌పుర రైల్వేస్టేషన్ రైలు పట్టల వద్దకు చేరుకున్నారు. మేకల కోసం కనిపించిన గడ్డిని సేకరిస్తూ అందులో లీనమై పోయారు. అంతలోనే యాకుత్ పుర స్టేషన్ మీదుగా ప్రయాణిస్తున్న రైలు సమీపంలోకి వచ్చిన సోదరులు గుర్తించలేక పోయారు. దీనితో రైలు ఇద్దరిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న యాకుత్ పుర ఎమ్మెల్యే జాఫర్ మేరాజ్ హుస్సేన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## చిల్కానగర్లో ఘనంగా తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలు

### స్వరాష్ట్ర సాధనకై ఏకమైన సబ్బండ వర్గాలు : పిట్టల నరేష్ ముదిరాజ్



**ఉప్పల్-నవభూమి:** తెలంగాణ మలిదశ ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిట్టల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చిల్కానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాలను స్థానిక నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు కేసీఆర్ ఒక్కరే మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకే కావాలని ఎన్నో పదవులను త్యాగం చేసి ఉద్యమ బాట పట్టారు. సకల జనులను ఏకం చేసి మహెూత్తరమైన ఉద్యమాన్ని నిర్మించాడని తెలిపారు. నిరాహార దీక్ష చేపట్టి ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత బాపు కేసిఆర్ కు దక్కుతుందని ఉద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ పాత్ర చరిత్రలో నిలిచిపోతుంది, తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని కొనియాడారు. ఉద్యమంలో తన పాత్ర ఉండడం పట్ల గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంబటి జగదీష్ ముదిరాజ్, పల్లె నర్సింగ్ రావు, జల్లి మోహన్, గుడి మధుసూధన్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి, ఎడ్ల పరమేశ్వర్, మహిళా నాయకురాలు స్వప్న విజయ సువర్ణ రేణుక యువజన నాయకులు మేకల జీవన్, కల్వల సంతోష్, పాలమాకుల సురేష్, పొట్టోలు రాజు కట్ట వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేశారు

**బడంగ్‌పేట -నవభూమి:** దేవాలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పెద్దపీట వేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. హైదరాబాద్ శివారు మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్‌లోని శ్రీ శ్రీ కామరాతి బీరప్ప స్వామి కల్యాణ మహెూత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పురాతన దేవాలయాల అన్నింటిని బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తీర్చిదిద్దడం జరిగిందని గుర్తు చేశారు. దేవాలయాల అభివృద్ధికి గతంలో ప్రత్యేక నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు.

# ప్రగతే మా పథం

- రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతాం
- 2047కి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- న్యూయార్క్, టోక్యోతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- 9 మంది ప్రముఖులకు నగదు పురస్కారాలు
- రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన
- రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, ఖర్గే, రాహుల్



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పారదర్శక పరిపాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. 2047 నాటికి తెలంగాణను నంబర్‌వన్ స్థానంలో నిలిపే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి.. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జపాన్‌లోని కిటాక్యుషు నగర మేయర్ కజుహిసా టకేచీ.. అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలనుద్దేశించి సీఎం మాట్లాడుతూ.. తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న ప్రణాళికలను వివరించారు. "2047 నాటికి తెలంగాణను దేశంలో అగ్రభాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నాం. ఆ దిశగానే 'తెలంగాణ రైజింగ్-2047' భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. వాటిని నెరవేర్చే ప్రయత్నాలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజల ఆలోచనలే ఆచరణగా ముందుకెళుతున్నాం" అని సీఎం రేవంత్ అన్నారు. సామాజిక తెలంగాణ కోసం బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం వంటి నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

**పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం..**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణను, ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి పలు చర్యలు చేపట్టినట్లు సీఎం రేవంత్ చెప్పారు. మూసీ పునరుజ్జీవ పథకం, ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, మెట్రో రైలు విస్తరణ ప్రణాళికలు, విమానాశ్రయాలు, రీజినల్ రింగ్ రోడ్డు వంటి అంశాలను వివరించారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని, ఇందుకోసం 27 ఎకరాల్లో రూ.2,700 కోట్లతో కొత్త భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని చెప్పారు. యువత మన భవిష్యత్తు అని, అందుకే తమ ప్రభుత్వం 16 నెలల్లోనే 60 వేలకు పైగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి, నియామక పత్రాలు అందించిందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి అమలు చేస్తున్నామని, సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నామని అన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

**న్యూయార్క్, టోక్యోకు దీటుగా ఫ్యూచర్ సిటీ...**

న్యూయార్క్, టోక్యో నగరాలతో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో తెలంగాణ ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా మారుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నామని అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నప్పుడే రాష్ట్ర అభివృద్ధి, నిర్దేశిత లక్ష్యాలు సాధ్యమవుతాయని సీఎం అన్నారు. ఆ లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగాన్ని పటిష్టపరచడం, మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ వేదికగా మారుస్తూ భారత్ సమ్మిట్‌ను నిర్వహించామని, 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదంతో మన సంస్కృతి, చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటాలన్న లక్ష్యంతో 'మిస్ వరల్డ్' పోటీలు నిర్వహించామని చెప్పారు. ఇక రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకెళుతోందని సీఎం అన్నారు. మహిళల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం చేపట్టిన పలు పథకాలను వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక కార్డులు అందజేయాలని నిర్ణయించామని, వారికి ప్రతి సంవత్సరం ఉచిత



వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ వివరాలతోపాటు పూర్తి వివరాలను ఆ కార్డులో పొందుపరుస్తామని తెలిపారు.

**వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు..**

రాష్ట్రానికి వెన్నెముక రైతేనని, వారికి ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎనిమిది నెలల్లోనే 25,35,964 మంది రైతులకు రూ.20,617 కోట్లు రుణమాఫీ చేసి.. అన్నదాతల రుణం తీర్చుకున్నామని తెలిపారు. "రూ.15,333 కోట్లతో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు అందిస్తున్నాం. వరి ధాన్యానికి మద్దతు ధరతోపాటు సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా భూ భారతి-2025 చట్టాన్ని తీసుకువచ్చాం. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నాం" అని సీఎం వివరించారు. ఇక రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో ప్రక్షాళనకు విప్లవాత్మక చర్యలు తీసుకున్నామన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రీ స్కూల్ విధానం తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నామని ప్రకటించారు.

**ఉద్యమకారులకు నగదు పురస్కారాలు..**

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మంది ప్రముఖులకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున నగదు పురస్కారాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అందజేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజు ఈ పురస్కారాలను సీఎం ప్రకటించారు. పురస్కారాలు అందుకున్న వారిలో ఎక్కా యాదగిరిరావు, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, పాశం యాదగిరి ఉన్నారు. దివంగత గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరికి సంబంధించి నగదు పురస్కారాన్ని వారి కుటుంబ సభ్యులు అందుకున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరేటి వెంకన్న తరఫున ఆయన కూతురు పురస్కారాన్ని స్వీకరించారు. కాగా, బహుబాషా సాహితీవేత్త నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారాన్ని సీఎం ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 19 మంది పోలీస్ అధికారులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి.. గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.



